# బంధుప్రీతి!

వడ్లమన్నాటి కుటుంబరావు

మారుతీరావు మామయ్యకి బంధుప్రీతి ఎక్కువని ప్రతీతి!

తెనాలిలో ఉంటూ పొన్నూరులో ఉన్న ఈ మామయ్య ఇంటికి కుటుంబ సమేతంగా వచ్చి ఆతిథ్యం స్వీకరించటానికి తీరికే లేదటోయ్ నీకు? అని కేక లేస్తున్నట్టుగా బోలెడన్ని ఉత్తరాలు రాశాడు ఇప్పటికే

పైగా ఇవ్వాళ వచ్చిన ఉత్తరం మరీ ఘాటుగా ఉంది వినాయక చవితికి నువ్వు అమ్మాయిని తీసుకుని మా ఇంటికి గనక రాకపోతే ఇక నీకు ఉత్తరాలు రాయను నీతో మాట్లాడను అని

ఏమంటావ్? అన్నాను ఉత్తరం శ్రీమతికి చూపిస్తూ

పాపం! ఆయన ఎంత ఆప్యాయంగా రాశారో చూడండి ఒకసారి వెళ్ళి వద్దామండీ! అంది గారాలు పోతూ

పొన్నూరును టెంపుల్ టౌన్ అంటారని మా ఆఫీసులో ఒక భక్తశిఖామణి పదే పదే చెపుతుంటాడు నాకూ కొద్దో గొప్పో దైవభక్తి ఉంది లెండి! ఈ రూపేణా ఆ గుళ్ళూ గోపురాలు కూడా చూసి రావచ్చనుకుని గ్రాంటెడ్ అన్నాను శ్రీమతితో

అబ్బ! మీ రెంత మంచివారండీ! అంది శ్రీమతి నా తల ప్రేమగా నిమురుతూ

అదే అదననుకుని నేన మెం దగ్గరగా లాక్కుని బుగ్గమీద ఏదో చిలిపి పని చేశాను

అబ్బ! మీరెంత చెడ్డవారండీ! అంటూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ లోనికి తుర్రుమంది శ్రీమతి

ఎదురు చూస్తున్న వినాయక చవితి పండుగ మూడు రోజుల్లో పడింది ఒక రోజు శెలవు పెట్టుకుంటే పండుగ రోజు- ఆదివారం శెలవులతో కలిపి మూడు రోజులు హాయిగా మారుతీరావు మామయ్య ఇంట్లో విందు భోజనాలు చేయవచ్చు సరదాగా సంతోషంగా గడపొచ్చు" అనుకున్నాను

ఆఫీసుకు వెళ్ళి ఆఫీసరు గారికి అతి వినయంగా ఏదో చెప్పి శెలవు ప్లస్ పర్మిషను గ్రాంట్ చేయించు కొచ్చేసరికి శ్రీమతి సింగారించుకుని ప్రయాణానికి సిద్ధంగా ఉంది

నీ పర్సులో డబ్బెంత ఉంది? అన్నాను వంద రూపాయలు పైన! అంది శ్రీమతి నా దగ్గర రెండు వందలకు పైగా ఉన్నయ్ సరిపోదూ? అన్నాను

మీ మామయ్య తన మేనల్లుడిచేత డబ్బు ఖర్చు పెట్టిస్తా డేమిటి? మన దగ్గర ఉన్నదే చాలా ఎక్కువ పదండి! అంది శ్రీమతి

ఇద్దరి బట్టలూ వగైరా ఉన్న బ్రీఫ్‌కేసును సైడు బాస్కెట్లో పడేసి ఆమెను బుల్లెట్‌మీద ఎక్కించుకుని బయలు దేరాను నా కయితే పొన్నూరు వరకు మోటారు సైకిలు మీదే వెళ్ళాలని ఉంది కానీ శ్రీమతి అందుకు ఒప్పుకో లేదు

ఎందు కొచ్చిన శ్రమండీ? పైగా పెట్రోలుకు చాలా ఖర్చు! రైల్లో వెడదాం చక్కగా కబుర్లు చెప్పుకొంటూ అంది

ఆమె చెప్పిందే సబబని పించింది బాగా ఆలోచిస్తే దారిలో కిలో స్వీట్సు పాకెట్‌కొని బుల్లెట్‌ని రైల్వే స్టేషనులోని స్టాండులో పార్కు చేసి పూరీ తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఎక్కాము టిక్కెట్లు తీసుకొని

కిటికీ పక్కగా కూర్చొంది శ్రీమతి ఆమె పక్కన నేను ఆడవాళ్ళకి ప్రయాణమంటే ఆవకాయ పచ్చడి కలుపుకుని గిన్నెడు నెయ్యి పోసుకుని అన్నం తిన్నంత ఇష్టం కాబోలు! హద్దూ అపు లేకుండా పుంఖాను పుంఖాలుగా కబుర్లు చెప్పుకు పోతోంది శ్రీమతి నేను ఆమె చెప్పే కబుర్లు వింటున్నట్టు నటిస్తూ ఆమె అందాన్నీ బయట కనుపించే ప్రకృతి సౌందర్యాన్నీ ఆస్వాదిస్తున్నాను

ఓ అరగంటలో నిడుబ్రోలు స్టేషనులో ఆగింది రైలు

స్వీట్స్ పాకెట్ బ్రీఫ్ కేసుతో పాటు ఇద్దరం దిగాము

రిక్షా! అంటూ కేకేశాను బయటి కొచ్చిన తరవాత ఇద్దరం ఎక్కి కూర్చున్నాము ఓవర్ బ్రిడ్జి పక్కగా ఉన్న రైలు గేటుగుండా పొన్నూరులోకి ప్రవేశించి జోరుగా పోతున్న రిక్షాలోంచి బిజీగా ఉన్న బజారు కేసి చూస్తున్నాము నేను శ్రీమతి

మనల్ని చూసి మీ మామయ్యగారు పొంగి పోతారు కదండీ! అంది- ప్రయాణోత్సాహంతో

ముందు మీరు పొంగి పోతున్నారు కదండీ! ఇవ్వాళ వంటింటికి హాలిడే డిక్లేర్ చేసినందుకు! అన్నాను వెక్కిరింతగా

ఏం? మీకు జెలసీగా ఉందా? అంది నన్ను మోచేత్తో పొడుస్తూ నవ్వుతూ

నేను ఆమె నెత్తిమీద అలవోకగా చిన్నగా మొట్టబోయి అది పబ్లిక్ ప్లేసనీ ప్రైవసీ లేదనీ ఊరుకున్నాను

వాకిట్లో ఆగిన రిక్షా చూసి వరండాలో పడక్కుర్చీలో కూర్చున్న మారుతీరావు మామయ్య ముఖం చేటంతయింది దాదాపు గంతేసినంత పని చేసి వాకిట్లో పడ్డాడు

రావోయ్! విస్సూ! రామ్మా! రండి! ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు? ఒసేవ్! అంటూ కేక వేశాడు లోపలికి

ఇంట్లోంచి మమ్మల్ని గమనించిన మా అత్తయ్య రత్తమ్మ వాళ్ళబ్బాయి సాయి పరుగెత్తు కొంటూ వచ్చారు

ఏమయ్యా! ఇప్పటికయినా మేం గుర్తొచ్చి నందుకు చాలా సంతోషం ఏమ్మా బాగున్నావా? అంటూ పలకరించింది అత్తయ్య

ఏం బావా? ఇప్పటికయినా మా చెల్లాయిని మా యింటికి తీసుకొచ్చావు థాంక్స్ అన్నాడు సాయి

ఉచిత రీతిని సమాధానం చెప్పి డబ్బు లిచ్చి రిక్షాని పంపించాను నేను

కాళ్ళకు నీళ్ళిచ్చింది అత్తయ్య తుండు అందించాడు సాయి

కుర్చీలో కూర్చున్న తర్వాత కాసేపు పలకరింపులు ఆప్యాయత ఆత్మీయతల చిలకరింపులు పూర్తయ్యాయి

మేము వాళ్ళింటికి వచ్చినందుకు ఇంటిల్లిపాదికీ సంతోషంగా ఉందనేది నిర్వివాదాంశం!

చుట్టాలు వస్తే దయ్యాలు వచ్చినట్లు భయపడుతున్న ఈ రోజుల్లో ఈ కుటుంబం- బంధువులకు పూర్ణకుంభ స్వాగత మివ్వటం చాలా ఆశ్చర్యంగానే ఉంది నాకు అయినా ఆనందంగానూ ఉంది!

స్వీట్సు పాకెట్ శ్రీమతి చేత అత్తయ్య కిప్పించాను

ఎందుకమ్మా ఇవన్నీను? అంటూనే పుచ్చుకుంది అత్తయ్య

ఇదుగో మేనల్లుడూ! మారుతీరావు మామయ్యను వెదవను చెయ్యటం ఎప్పటి నుంచీ నేర్చుకున్నావ్? బాధపడుతున్నట్టు కణతలు నొక్కుకుంటూ అన్నాడు మామయ్య

ఏమిటి మామయ్యా? కంగారుగా అన్నాను శ్రీమతి కూడా విస్తుపోయి చూస్తోంది

ఈ మామయ్యకు ప్రేమ పంచి ఇవ్వటమే తప్ప భాగం పంచుకోవటం అలవాటు లేదోయ్! అన్నాడు

అంటే? అన్నాను అర్థంకాక

ఆతిథ్యం ఇవ్వటమే తప్ప అప్పనంగా పుచ్చుకోవటం ఇష్టం లేదోయ్! అయినా నువ్వు

మేనల్లుడివయి పోయావు అల్లుడు కడు స్వతంత్రుడు కదా' అన్నాడు సన్నగా నవ్వుతూ

స్వీట్లు పట్రావద్దు అని చెప్పటాని కొచ్చిన పాట్లన్న మాట' అని మనసులో అనుకుని వాతావరణాన్ని తేలిక పరచటం కోసం నేనూ పైకి నవ్వేశాను

రత్తమ్మత్తయ్యకి సైగ చేశాడు మామయ్య ఆమె సాయితో సహా లోపలికి వెళ్లి పోయింది మామయ్య- నేను చాంద్రాయణంలో పడ్డాం శ్రీమతి పూల మొక్కల్ని చూస్తోంది

పది నిముషాల్లో ట్రేతో ప్రత్యక్షమయ్యారు తల్లీ కొడుకులు'

దానిలోని ప్లేట్లు కప్పులు మా భార్యాభర్తల ముందుంచబడ్డాయి టీపాయ్ మీద

ఫ్రై చేసిన జీడిపప్పు చెర్రీపళ్ళు స్వీట్ అండ్ సాల్ట్ బిస్కెట్లు కప్పులో లెమన్ వాటర్'

ఇవి కానీండి క్షణాల్లో వంట పూర్తి చేస్తాను అందరం కలిసి హాయిగా కబుర్లు చెప్పుకుంటూ తిందాం' అంది రత్తమ్మత్తయ్య

వంటపనిలో సాయం చేస్తానని లేవబోయిన నా శ్రీమతిని చనువుగా కసురుకుని చిరునవ్వుతో కూర్చునేట్టు చేసింది అత్తయ్య

చూస్తావేంటోయ్ మేనల్లుడూ' లాగించు అమ్మాయ్' నువ్వు కూడా కానీమ్మా' ఆప్యాయంగా అన్నారు మామయ్య

ఊ బావా అండ్ చెల్లెమ్మా' అంటూ తొందర పెట్టాడు సాయి

మేమిద్దరం మొహమాట పడుతూంటే ఊరుకోలేదు మామయ్య సాయితో లోపలి నుంచి తెప్పించి కొసరి కొసరి తినిపించారు

పన్నెండు గంటల వరకూ మామయ్య సాయిలతో కబుర్లతో గడచి పోయింది

వంటయింది వడ్డించేస్తున్నా' గంట కొట్టి నట్టుగా కంగు మంది అత్తయ్య కంఠం

ఆమె చెయ్యి నిజంగా అమృతమే' రుచికరమైన శాకపాకాలు నోరూరుంచే పిండి వంటలు ఓహ్' దంతసిరి ఉండాలే గానీ అంతకన్నా ఇంకేం కావాలి జీవితంలో ?

సుష్టుగా బ్రేవ్‌మని త్రేన్చి మత్తుగా నిద్ర పోయాను

సాయంత్రం నాలుగింటికి వేడి వేడి పకోడీలు గరమ్ గరమ్ చాయ్'

మళ్ళీ రాత్రికి కమ్మని భోజనం' కొసరి కొసరి వడ్డింపులు వద్దంటే చిరు చిరు మందలింపులు'

నా మనసులోని కోర్కె గ్రహించారా అత్తయ్యా మామయ్యలు ? అన్నట్టుగా రాత్రి మా జంటకు ఓ ప్రత్యేకమయిన గదిని కేటాయించారు

శ్రీమతి నా గదిలోకి రానని మొరాయిస్తుంటే సిగ్గుతో మొగ్గయిపోయి మెలికలు తిరిగి పోతూంటే తప్పమ్మా' అలా అనకూడదు నువ్వు మా అమ్మాయి లాంటి దానవు నీ కడుపు పండి పనసపండు లాంటి బిడ్డ కలగాలంటే ఇలాంటి కొత్త చోట అబ్బాయితో మధురానుభూతులు పంచుకోవాలిస్మీ' అంటూ శ్రీమతిని లోపలికి నెట్టి తలుపులు దగ్గరకు లాగింది

అత్తయ్యకు మనసులోనే వేయి ధన్యవాదా లర్పించు కున్నాను

మీ మామయ్య ఫామిలీ అంతా ఎంత మంచివాళ్ళండీ? ఆ ఆప్యాయత ఆ ఆత్మీయత' అంటూ తెగమెచ్చుకుంది శ్రీమతి ఒకటికీ పదిసార్లు

దానితోపాటు వాళ్ళమ్మాయిగారితో ఈ ఏకాంతం ఏర్పాటు చేసినందుకు మా అత్తయ్యకు నా హృదయపూర్వకమైన అభినందన సహస్రాలు' అన్నాను నేను నాటకీయంగా

వాళ్ళమ్మా యెవరు? శ్రీమతి గొంతులో ఆశ్చర్యంతో పాటు అసూయకూడా ధ్వనించింది

చెప్పమంటావా?

అబ్బ తొందరగా అంది శ్రీమతి ఓర్పుపట్టలేక

నేను మంచంమీద నుంచి లేచివెళ్ళి తలుపులు లోపల గడియవేశాను

చటుక్కున లైటార్పేసి శ్రీమతిని మంచంమీదకు లాగేసి ఈ అమ్మాయే' అన్నాను చిలిపిగా

ఛీ' మీకసలు సిగ్గులేకుండాపోతోంది బొత్తిగా కొత్తచోటులో కూడా ? అంటూన్న శ్రీమతిని ఆపైన మాట్లాడనివ్వకుండా చేశాను

ఆ మరుసటి రోజే వినాయకచవితి'

నేను-శ్రీమతి తలంట్లు ముగించుకుని వచ్చేసరికి వేడివేడి కాఫీ సిద్ధంచేసింది అత్తయ్య

కాఫీ సేవించేసి ఉదయంపూట నేనూ మామయ్యా శ్రీమతి కలిసి పొన్నూరులో ఉన్న గుళ్ళన్నీ తిరిగి దైవదర్శనం చేసుకుని తిరిగి రిక్షాల్లో మామయ్య యిల్లు చేరుకునేసరికి పదకొండు గంటలయ్యింది

అత్తయ్య చేసిన ఎండివంటల వాసన నోరూరించిపారేస్తోంది వంటింట్లోంచి

అందరం కలిసి వినాయకచవితి పూజచేసి భోజనాల కుపక్రమించాము నేను భోంచేశాను అనేకంటే నోటితో దండెత్తాను అంటే బాగుంటుం



దేమో'

ఆ సాయంత్రం అత్తయ్యా శ్రీమతి కలిసి బజారు వెళ్ళివచ్చారు

మర్నాడు ఉదయం నేను సాయి కలిసి అతని

# బంధుప్రీతి

యెక్కిమీద సరదాగా ఊరంతా చుట్టివచ్చాం

ముచ్చటగా మూడో రాత్రి భోజనాలుకూడా దివ్యంగా పూర్తయినయ్!!

మర్నాడు ఉదయమే పాసింజరు రైల్లో మా తిరుగు ప్రయాణం

రాత్రి శ్రీమతి నా గదిలోకి రాగానే ఆబగా ఆమెను దగ్గరకు లాక్కోలేకపోయాను నా మనసులో ఉవ్వెత్తుగా ఎగసిపడుతున్న ఆలోచనలు ఒకపక్క సంతోషం మరోవేపు మూలుగు తున్న మనసు!

ఆశ్చర్యం!

నేను స్తబ్దుగా ఉంటే ఎంతమాత్రం ఊరుకోని శ్రీమతి కూడా ఎలాంటి చలనం లేకుండా అటు తిరిగిపడుకుంది

వంట్లో బాగోలేదా?' అన్నాను యధాలాపంగా ఆమె నడుంమీద చెయ్యేసి

'బాగానే వుంది "

మరి అలా వున్నావేం డల్‌గా?

మీరుమాత్రం సరదాగా ఉన్నారా? ఎదురు ప్రశ్న వేసింది

నువ్వలా ఎందుకున్నావో నాకు తెలుసు! రహస్యం కనిపెట్టినట్టుగా అన్నాను నవ్వుతూ

నా నవ్వు నాకే నిర్జీవంగా అనిపించింది

మీరూ నేనూ ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నాం నవ్వెలా వస్తోంది మీకు? నిష్ఠూరంగా అంది

అబ్బ! చంపక అసలు విషయమేమిటో చెబుదూ బ్రతిమాలాను శ్రీమతిని

విసిగించకుండా జరిగింది చెపితే విని సం తో షి స్తా ను ఆమెకంఠంలో ఏదో అజ్ఞాత వేదన

ముందు నువ్వే చెప్పు

'కాదు మీరే చెప్పండి!

చెప్పమంటుంటే నాగొంతులో విసుగు చెప్పనంటుంటే శ్రీమతి గొంతులో చికాకు! ఆ తరువాత మా యిద్దరి మధ్య భరించరాని మౌనం!

కాగలకార్యాన్ని గంధర్వులే తీరుస్తారు అన్నట్టుగా మా పక్క గదిలోంచి మారుతీరావు మామయ్య గొంతు స్పష్టంగా వినిపిస్తోంది ఆ నిశ్శబ్ద నిశీదిలో అప్పటికి టైం పదకొండు గంటలయి ఉండవచ్చు

ఉందు ఏమిటా తొందర?

ఎంతసేపు? త్వరగా కానీండి అది అత్తయ్య కంఠం

వీళ్ళ ముసలి శృంగారం మసిబొగ్గయిపోనూ అనుకుని ముసిముసిగా నవ్వుకున్నాను

ఆఁ! చెప్పనా? నూటయాభై రూపాయలు! మామయ్య గొంతు నా ఊహ తప్పని రుజావుచేసింది

వాళ్ళు మాట్లాడుకునేది డబ్బు సంగతన్నమాట! నొచ్చుకున్నాను

కానీ చెవులు రిక్కించాను ఇంకా స్పష్టంగా వినిపించటం కోసం

మరి నీ వసూలెంత?' మళ్ళీ మామయ్య గొంతు

వంద అత్తయ్య జవాబు

'ఎలా చేశావో చెప్పు

"ముందు మీరే చెప్పండి '

సరే విను! కొబ్బరికాయ దగ్గర నుంచి దక్షిణవరకూ మా మేనల్లుడి డబ్బులతోనే నిర్వాకం చేసి బేవార్సుగా దైవదర్శనం చేసుకుని తిరిగి వస్తున్నప్పుడు అమ్మాయి– గుడి ముందర పూలకొట్టు దగ్గర ఆగి బేరం చేస్తోంది నేనూ మా వాడు ఓ పది గజాలు ముందుకు నడిచి వస్తుంటే కమీషన్ కామేశంగాడు కనిపించాడు దేవుడిలా! వాడికి మన బాష బాగా తెలిసిందే గదా! కనుసైగ చేశాను వాడు నన్ను అమాంతం చొక్కా పట్టుకుని నా రెండొందలు బాకీ నిలుచున్న పళంగా ఇస్తావా? లేకపోతే నీ పరువు ఈ పొన్నూరులో మన్ను చెయ్యనా? అన్నాడు అది చూచి నా మేనల్లుడు కంగారు పడిపోయి, ఏమిటి మామయ్యా? ఇతనెవరు? ఏమిటి విషయం? అన్నాడు జవాబు కామేశంగాడే చెప్పాడు వచ్చిన చుట్టాలకి విందు బోజనాలు పెట్టటానికి ఊరంతా అప్పులు చేసి మాకు కనపడకుండా తప్పించు కున్నాడు బాబూ! ఇవ్వాళ ఈయన్ని వదిలి పెట్టను అన్నాడు వాడి నటనా చాతుర్యానికి ముగ్ధుణ్ణయిన నేను ప్రసన్నంగా చూశాను వాడికేసి అంతే! ఏమనుకున్నాడో ఏమో నా మేనల్లుడు జేబులోంచి నూటయాభై రూపాయలు తీసి వాడి చేతిలో పెట్టేశాడు అప్పుడు వాడు నా చొక్కా వదిలి పెట్టాడు నా మేనల్లుడు అమ్మాయి దగ్గరకు అడుగు లేస్తుండగా అతను చూడకుండా కామేశంగాడు నూట యాభై రూపాయలు నా జేబులో పెట్టటం నేను వాడి కమీషన్ పది రూపాయలు ఇవ్వటం వాడు వెళ్ళిపోవటం జరిగి పోయింది– క్షణాల్లో

ఏమిటి సంగతి? అంది అమ్మాయి ఏం లేదని చెప్పాడు– మేనల్లుడు ఇదీ కథ ఇక నువ్వు కానీ

మామయ్య గొంతుస్థానే అత్తయ్య కంఠం వినిపించ సాగింది

అమ్మాయి నేను బజారు కెళ్ళాం గదా నిన్న ఆమె కోసం ఓ చీర ఎంపిక చేసి కొన్నాను ఎలా ఉంది? అన్నాను బాగుంది! అంది అలా అనకేం చేస్తుంది పాపం! జాకెట్లోంచి మనీపర్సు తీసి ఆమె ముందే తెరిచాను అందులో డబ్బులు ఖాళీ! వెంటనే మీమీద విసుక్కున్నాను చూడమ్మాయ్! మీ బాబాయ్‌కి బుద్ధుందా అసలు! చెప్పా పెట్టకుండా పర్సులో డబ్బులన్నీ తీసేస్తారు ఇప్పుడెలా కొనేది చీర ? ఆఁ! అమ్మాయ్! ఒక వంద ఉంటే అప్పివ్వు తల్లీ! యింటి కెళ్ళగానే మీ బాబాయ్ నడిగి తీసుకుని ఇస్తాను అన్నాను పిచ్చిమాలోకం తన జాకెట్లోంచి చిన్న ముఖమల్ పర్సు తీసి తళతళలాడే వంద రూపాయల కాగితం ఇచ్చేసింది చీర పాకెట్ తీసుకుని ఇంటికి తిరిగి వచ్చేశాము


కొంపదీసి నా జేబులో డబ్బులు తీసి అమ్మాయికి ఇవ్వలేదు గదా?! అనుమానంగా అడుగుతోంది మామయ్య కంఠం

నేను మీ బార్య నండోయ్ మారుతీరావు గారూ! అంటోంది అత్తయ్య పకపకా నవ్వుతూ

మన సుపుత్రుడు సాయి హాయిగా వాడి మోటారు సైకిలు పెట్రోలు ఖర్చు ఇరవై రూపాయలు నా మేనల్లుడి మీద రుద్దేడట తెలుసా? అంటున్నాడు మామయ్య

"తెలుసు. అద్సరే మీరు నూటయాభై రూపాయలు... నేను వంద రూపాయలు తిరిగి ఇవ్వమని మీ మేనల్లుడికి తెలుసా పాపం?" పరిహాసంగా అంటోంది అత్తయ్య

"వాళ్ళు అడగలేరు... మనం ఇవ్వబోము! వాళ్ళకు చేసిన అతిథి మర్యాదలకు దాదాపు నూరు



రూపాయలు ఖర్చయి ఉంటుంది ఇంకా యాభై రూపాయలు లాభమే మనకు. చీర ఖర్చు మినహాయించినా అంటున్నాడు మామయ్య

ఇక జన్మలో వీళ్ళు మనింటికి చుట్టం చూపుగా రారు గదా! తరువాత ఎవరిమీద విసర బోతున్నారు వల? అంటోందత్తయ్య చూద్దాం అంటున్నాడు మామయ్య

ఇద్దరూ పకపకా నవ్వుకున్నారు

నిర్ఘాంత పోయాను నేను ఇదా వీళ్ళ బంధుప్రీతి! వారేవా!!!

శ్రీమతి మీద చెయ్యి వేసి కుదిపాను నీరసంగా

అంతా విన్నా లెండి ఖర్మ! మీరు నూటయాభై ప్లస్ ఇరవై నేను వంద రూపాయలు స్వీట్స్ పాకెట్‌కి ముప్ఫయ్ రూపాయలతో కలిపి మొత్తం మూడు వందలకి పైగా తిరుక్షవరం! తెనాలిలోనే ఉంటే వినాయక చవితికి చక్కగా కింగ్‌పాలస్ చీర కొనుక్కొని కట్టుకునే దాన్ని ప్చ్! అంది శ్రీమతి బాధగా

ఇద్దరం ఒకరి నొకరు ఓదార్చుకున్నాం

తెల్లారిన తరవాత మేం బయలు దేరుతుంటే మారుతీరావు మామయ్య ఎంతగానో వాపోయాడు కనీసం నెల కొకసారయినా వస్తుండవోయ్ మేనల్లుడూ! అమ్మాయిని తీసుకుని నా కసలే బంధుప్రీతి ఎక్కువ! అన్నాడు గద్గదికంగా

అత్తయ్య నా శ్రీమతికి బొట్టుపెట్టి చీరపెట్టి కనీసం రెండు నెలలకి ఒకసారయినా మీ ఆయన్ని చెయ్యి పుచ్చుకుని లాక్కురా అమ్మా! మీ కొసం ఎదురు చూస్తుంటాము అంది కళ్ళలో నీళ్ళు తిప్పుకుంటూ

బావా! శతదినోత్సవమయిన తరవాతన్నా చెల్లెమ్మను తీసుకుని చల్లగా మా యింటికి రావా? అన్నాడు సాయి హాస్యంగా

ఎందుకు? మరో మూడొందలు అర్పటానికా? అని మనసులో అనుకుని పైకి మాత్రం అలాగే మీరూ రండి ఒకసారి తెనాలికి అని మొక్కుబడిగా బయపడుతూనే అని వాళ్ళ జవాబుకి ఎదురు చూడకుండా నేనూ, శ్రీమతి, బ్రీఫ్‌కేసూ రిక్షాలో కూలబడ్డాం

రైల్వే స్టేషనులో చూసుకుంటే పర్సులో పదహారు రూపాయల చిల్లర మాత్రమే ఉంది టిక్కెట్లు కొని పాసింజరు ఎక్కాము

తెనాలి చేరేంతవరకూ మారుతీరావు మామయ్యని, అత్తయ్యని తిడుతూనే ఉంది శ్రీమతి

నేను మౌనంగా ఉండి ఆమెను ప్రోత్సహించానేమో ?!

బుల్లెట్ ఎక్కి నాజరు పేటలోని మా యింటికి చేరి నిస్సత్తువగా సోఫాల్లో వాలిపోయాం

ఆ రాత్రి మామయ్య బంధుప్రీతిని గురించి ఆయన- చుట్టరికంతో చేసే వ్యాపారం గురించి దీర్ఘంగా ఆలోచించాను

దానికి అక్షర రూపమే ఈ కథ అని చెప్పుకోటానికి నాకేం మొహమాటం లేదు □

## ధర్మపథం

# ఉండదగిన ఊరు

మనం ఎలాటి ఊరులో ఉండవలెనో తెలుపుతూ సుమతి శతక కర్త "అప్పిచ్చువాడు వైద్యుడు, ఎప్పుడు ఎడ తెగకపారు ఏరు....." ఉన్న చోటనే ఉండాలని సలహా ఇచ్చాడు. ఇవన్నీ నిత్య జీవనానికి సంబంధించినవి. ఇవి ఉన్న ఊరిలో ఉన్నా జీవనం సుఖంగా గడప వచ్చునని నిశ్చయించలేము. పయివన్నీ బ్రతుకు తెరువుకు సంబంధించినవి. ఇవి ఉంటే చాలదు. పరిసర వాతావరణం కూడా అనుకూలంగా ఉండాలి. దీనిని గూర్చి ఒక శ్లోకం ప్రసిద్ధంగా ఉన్నది. అది....

"లోకయాత్రా నయో లజ్జా
దాక్షిణ్యం త్యాగ శీలతా,



పంచ యత్రన విద్యంతే
న తత్రే దివసం వసేత్."

పట్నాలలో కంటె పల్లెటూళ్ళలోనే పార్టీలు, పరస్పర ద్వేషాలు, చిక్కులు ఎక్కువ. ఎవరి జోలికీ పోకుండా నెమ్మదిగా కాలం గడిపేవారిని- కూడా లేనిపోని తగాదాల్లోకి దింపుతారు. రచ్చకు ఈడుస్తారు. అట్టి స్థితిలో తీర్పరులు న్యాయాన్నీ, ధర్మాన్నీ పాటించకుండా- పక్షపాతం వహించి న్యాయం జరగ వలసిన వారికి అన్యాయం జరిగితే, వారు ఎవరితో చెప్పుకో గలరు. అందువల్ల గ్రామంలో ధర్మం పాటించ బడడం ఎంతో అవసరం.

కొందరు అవినీతిపరులు సిగ్గుమాలిన పనులు చేసినా, తామేదో ఘన కార్యం చేసినట్లు భావిస్తూ, మొండి ధైర్యంతో నలుగురిలోనూ గౌరవనీయుల లాగే కలిసి తిరుగుతూ ఉంటారు. వారిని చూస్తే మంచివారికి అసహ్యం కలుగుతుంది. అయినా వారు ఏమీ చేయలేని స్థితిలోనే ఉంటారు.

పట్నాలలో ఉన్న వారికి తమ పనులు చూసుకోవడంతోనే కాలం గడిచి పోతుంది. ఇరుగు పొరుగుల వారితో ప్రసక్తి తక్కువ. కొందరికి ఇరుగు పొరుగులలో ఎవరున్నదీ తెలియదు. పల్లెటూళ్ళలో ఉన్నవారికి గ్రామంలోని అందరి సంగతీ బాగా తెలుస్తుంది. అందువల్ల ఎవరికైనా కష్టం వచ్చి, ఇతరుల సహాయం కావలసినపుడు మిగిలిన వారు వారిపయి దయ చూపి సహాయం చెయ్యడం ధర్మం. ఆ విధంగానే గ్రామంలో బీదతనంతో బాధపడుతున్న వారికి- కాస్త ఉన్నవారు త్యాగబుద్ధి చూపి, ఆర్థికంగానూ, ఆహార పదార్థాలు ఇచ్చి తోడ్పడ వలసి ఉంటుంది. ఇలా సహాయం చేసేవారు గ్రామంలో మంచి పేరు తెచ్చుకుంటారు. అందరూ అట్టివారిని ఎంతో గౌరవిస్తారు.

ఇలాటి గుణాలు ఉత్తములలోనే ఉంటాయి. అందువల్ల అట్టి వారు లేని ఊరిలో ఒక దినం కూడా ఉండకూడదు. ఉండడం సాధ్యం కాదు కూడా.

– బులుసు వేంకటరమణయ్య